సాక్షి

గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 29 । నవంబర్ । 2023

సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 29 । నవంబర్ । 2023



పోలింగ్‌కు సర్వం సిద్ధం

కమిషనరేట్ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. - IVలో▸



విద్య ద్వారానే వ్యవస్థ నిర్మాణం

విద్య ద్వారానే వ్యవస్థ నిర్మాణమవుతుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. - IVలో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రతతో పొడి వాతావరణం ఉంటుంది. సాయంత్రం చలి ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాల మూసివేత



కరీమాబాద్: ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాలోని కల్లు, మద్యం దుకాణాలు, బార్లను మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు మూసేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని 63 వైన్స్, 7 బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేసి సీల్ వేశారు. వరంగల్ రూరల్ జిల్లాలో డ్రై డేను పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎక్సైజ్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1800–425–2523కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

వరంగల్ అర్బన్ జిల్లాలో..

కాజీపేట అర్బన్: ఎన్నికల నిబంధనల మేరకు డ్రై డేను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వరంగల్ అర్బన్ జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు, ఐఎంఎఫ్ డిపోలను మంగళవారం సాయంత్రం 5 గంటలకు మూసివేసినట్లు తెలిపారు. మద్యం అమ్మకాలు జరిపితే కంట్రోల్ రూం 0870–2577502 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కేయూలో మెస్‌లు బంద్



కేయూ క్యాంపస్: ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేయూలోని వివిధ హాస్టళ్ల విద్యార్థులు మంగళవారం స్వస్థలాలకు తరలివెళ్లారు. ఈనేపథ్యంలో క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్ల మెస్‌లను మంగళవారం సాయంత్రం నుంచి మూసివేసినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. డిసెంబర్ 2న మధ్యాహ్నం నుంచి మెస్‌లు తెరుస్తామని ఆయన తెలిపారు. హాస్టళ్లు మాత్రం తెరిచే ఉంటాయని పేర్కొన్నారు.

30న సెలవు

ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30న కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కళాశాలలు, కేయూ పరిధి అనుబంధ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్స్, మీటింగ్స్, పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

అడ్రస్ ఓ చోట.. పోలింగ్ కేంద్రం మరోచోట

కాజీపేట: కాజీపేటలోని 47వ డివిజన్ రైల్వే క్వార్టర్స్‌లో ఉండే ఓటర్లకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోడగుట్ట పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. పట్టణంలోని 140, 141 పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని బాపూజీనగర్ పోలింగ్ కేంద్రాన్ని వదిలి రైల్వే ట్రాక్ అవతల ఉన్న బోడగుట్టను ఎంపిక చేయడంపై ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉద్యోగుల కుటుంబాలు ఓటేయడానికి చుట్టూ తిరిగి వెళ్లి ఓటు వేయాలి.

అంకితభావంతో పని చేయండి



హన్మకొండ అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులంతా అంకితభావంతో కృషి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌వ్యాస్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. మద్యం, నగదు పంపిణీ కట్టడిలో చివరి రెండ్రోజులు కీలకమని తెలిపారు. అనంతరం కలెక్టర్ సిక్తా మాట్లాడుతూ.. ఈసీ మార్గదర్శకాలను పాటిస్తూ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం, పారిశ్రామికం

అభివృద్ధి మొదలైంది.. ఇక ఆగదు

- కాంగ్రెస్‌తో కుంటుపడిన వరంగల్ అభివృద్ధి
- మున్ముందు నగరానికి ఉజ్వల భవిష్యత్
- పెద్ద ఎత్తున రానున్న ఐటీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు
- ఇక్కడి ప్రజల బలంతోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించా
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు



వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

హన్మకొండ: ఓరుగల్లులో విద్య, వైద్యం, ఐటీ, పారిశ్రామికీకరణ మొదలైందని, ఇక ఆగదని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో వరంగల్ ప్రజలు తనకు బలాన్నిచ్చారని, ఈ బలంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపించానన్నారు. మరోసారి తనకు అదే బలాన్ని ఇవ్వాలని కోరారు. మంగళవారం వరంగల్ నగరంలోని కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ, తూర్పు అభ్యర్థులు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌ను గెలిపించాలని కోరుతూ.. నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో వరంగల్ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అజంజాహి మిల్లును మూసేయడంతో ఆస్తులాన్ని అమ్మిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. తాను వరంగల్ ప్రజలకు ఆ స్థాయికి తగ్గ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేశానన్నారు. దీంతో లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇప్పటికే కొన్ని ఐటీ కంపెనీలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఐటీ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యుత్ సంస్థలు రానున్నాయన్నారు. వరంగల్‌లో పెద్దఎత్తున పాడి పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు చెప్పానన్నారు. నగరంలో దుమ్ముధూళి పోయి బ్రహ్మాండమైన రోడ్లు వచ్చాయన్నారు. కాళోజీ పేరిట వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశానన్నారు. దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్ వరంగల్ ప్రజలు పెంచి పోషించిన బీసీ బిడ్డలని, ప్రజలంతా ఏకమై ఇద్దరిని గెలిపించాలన్నారు. చీఫ్ విప్ అయిన వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లో ఉండాల్సి ఉండగా.. వచ్చి హనుమకొండలోనే, ప్రజల మధ్య ఉంటున్నాడన్నారు. 'ఆటోలపై దాస్యం మా ధైర్యం' అని రాసుకోవడాన్ని తాను చూశానన్నారు. ఎంత ప్రేమ, ప్రజలకు అండగా ఉంటేనే ఇలా రాసుకుంటారన్నారు.

నిరంతర అభివృద్ధి

వరంగల్ అభివృద్ధి మొదలైందని, ఇక ఆగదని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు వచ్చేదని, ఇప్పుడు ప్రతి రోజూ వస్తుందన్నారు. కాజీపేట నుంచి వరంగల్ వరకు రైల్వే లైన్ చాలాదూరం ఉందని, ఈ రైల్వేలైన్‌పై 6 ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు అవసరమని, మళ్లీ అధికారంలోకి రాగానే నిర్మిస్తామన్నారు. 20 అంతస్తులతో అతి పెద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందని, హైదరాబాద్‌లో కూడా ఇంత పెద్ద ఆస్పత్రి లేదని, హైదరాబాద్‌కు వచ్చే రోగులు కూడా ఇక్కడికే రావాల్సి ఉంటుందన్నారు. 14 రకాల రోగాలకు చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. తూర్పు తెలంగాణ ప్రజలందరికీ వైద్యసేవలు అందుతాయన్నారు. సభలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, నాయకులు బొల్లం సంపత్‌కుమార్, మౌలానా జాహీద్, నాగుర్ల వెంకటేశ్వర్లు, దోనెపూడి రమేశ్ బాబు, రిజ్వానా షమీమ్, మర్రి యాదవరెడ్డి, ఎల్లావుల లలితా యాదవ్, జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు వినయ్‌భాస్కర్, నరేందర్



సభా వేదికపై నృత్యం చేస్తున్న మహిళా కార్పొరేటర్లు

ప్రజలే నాబలం, బలగం: వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్



హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి జరుగుతోందని వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తనను నియోజకవర్గ ప్రజలు వారిలో ఒకరిగా చూసుకున్నారని, నా బలం, బలగం ప్రజలేనన్నారు. సీఎం కేసీఆర్ సహాయంతో గుడిసెవాసులకు పట్టాలిప్పించానన్నారు. ఇంకా కొంతమంది ఉన్నారని, వారికి కూడా ఇప్పించాలని సీఎంను కోరారు. పేద, మధ్య తరగతి వారికి ఇళ్లు కావాలని కోరారు. సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ము చేయలేదన్నారు. ప్రజలకు సేవకుడిగా పని చేశానన్నారు. మళ్లీ గెలిపించాలని కోరారు.

లారీడ్రైవర్ కుమారుడిని ఈ స్థాయికి తీసుకొచ్చారు : వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్



లారీ డ్రైవర్ కుమారుడినైన తనను ఎమ్మెల్యే స్థాయికి.. సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. మైనార్టీలకు అవకాశాలు కల్పించాలన్నారు. విద్య, వైద్యంలో వరంగల్‌ను ఉత్తర తెలంగాణకు తలమానికంగా సీఎం కేసీఆర్ నిలిపారన్నారు. తనను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సభ సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 1.10 గంటలకు సీఎం కేసీఆర్ సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 1.25 గంటలకు ప్రసంగం ప్రారంభం
- 1.52 గంటలకు ప్రసంగం ముగింపు
- 26 నిమిషాలపాటు ప్రసంగం కొనసాగింది.
- తెలంగాణ ఉద్యమ సమయంలో మానుకోటలో జరిగిన ఘటనను గుర్తు చేసుకుని వీరికి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.
- వరంగల్‌కు వన్నె తీసుకొచ్చేలా మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని అమలు చేశామని తెలిపారు.
- రాజముద్రలో కాకతీయ తోరణాన్ని చేర్చామన్నారు.
- తెలంగాణ ఏర్పాటు కావాలని భద్రకాళి అమ్మవారికి మొక్కుకున్నానని, రాష్ట్రం ఆవిర్భవించగానే మొక్కు తీర్చుకున్నానని తెలిపారు.
- వరంగల్ సభ 95వది అని పేర్కొన్నారు.
- నన్నపునేని నరేందర్ వేదికపై నుంచి సభికులకు సాష్టాంగ నమస్కారం చేశారు.
- వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలనుంచి భారీగా జనం తరలివచ్చారు.

కాంగ్రెస్‌ను కోరుతున్న ప్రజానీకం

- వైఎస్సార్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి
- కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్



మాట్లాడుతున్న జైరాం రమేశ్

నయీంనగర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు కోరుకుంటున్నారని, తెలంగాణలో తమ విజయాన్ని ఎవరూ ఆపలేరని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జైరాం రమేశ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కుటుంబ పాలనలో తెలంగాణ బందీ అయిందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే.. కేసీఆర్ తెలంగాణ ప్రజలకు నమ్మక ద్రోహం చేశారన్నారు. తెలంగాణలో నియంత పాలన పోయి కాంగ్రెస్ ప్రజాపాలన రాబోతోందని కేసీఆర్‌ను ఫాంహౌస్‌కే పరిమితం చేయాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో నిర్ణయించిందని, కానీ.. స్థల సేకరణ చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. వరంగల్ నగరాన్ని కుట్రపూరితంగా అభివృద్ధి చేయకుండా నిధులు దారి మళ్లించారన్నారు. రాబోయే కాంగ్రెస్ పాలనలో వరంగల్‌ను ఐటీ హబ్‌గా మారుస్తామన్నారు. తెలంగాణలో కేసీఆర్ నాటకాల దుకాణం బంద్ అవుతుందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీ శర్మ, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వీ, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు శోభారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు రాఘవరెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.

సిటిజన్ యాప్‌లో పోలింగ్ శాతం

కాజీపేట: పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు వెల్లడిస్తారు. 17–ఎ రిజిస్టర్‌లో నమోదు చేసిన ఓట్లు, ఓటరు స్లిప్పులు, కంట్రోల్ యూనిట్‌లో మొత్తం ఓట్లు ఏకీభవించాలి. అప్పుడు పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తారు. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన శాతాన్ని ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత సెక్టార్ అధికారులకు పంపిస్తారు. సెక్టార్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారమందిస్తారు. జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ పోలింగ్ శాతం తెలుసుకోవాలంటే సిటిజన్ యాప్‌లో చూడవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



పోలింగ్ ఏర్పాట్లు వివరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ఈనెల 30న ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సీపీ అంబర్ కిషోర్ ఝాతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 5,81,124 మంది ఓటర్లున్నారని వారికి కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సమాచార స్లిప్‌ల పంపిణీ 92.35 శాతం పూర్తయిందన్నారు. ఈనెల 29 వరకు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఉందని, వినియోగించుకోవాలని కోరారు. సీపీ మాట్లాడుతూ.. పోలింగ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు, జిల్లాలో 484 పోలింగ్ కేంద్రాలుండగా.. వాటిలో 68 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

అందరూ సహకరించాలి: కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: పోలింగ్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రశాంత పోలింగ్‌కు అందరూ సహకరించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ చర్యలు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీపీఆర్‌ఓ ఆయుబ్‌అలీ, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లాలోని పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన మూడో ర్యాండమైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముఘరాజన్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డులతో..

ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) లేకపోతే 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ప్రచారానికి తెర.. ప్రలోభాల ఎర!

అగ్రనేతల ప్రచారంతో హోరెత్తిన ఓరుగల్లు

- నేతల మాటల తూటాలతో ఎన్నికల పోరు రసవత్తరం
- ఓట్లు కొల్లగొట్టేందుకు ప్రధాన పార్టీల వ్యూహాలు
- షరా అయిన డబ్బు, మద్యం పంపిణీ
- ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేలు?



సాక్షిప్రతినిధి, వరంగల్:

సార్వత్రిక ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ఈనెల 15న ముగియగా.. సుమారు 13 రోజుల పాటు అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం సాగించారు. నేతలు చివరి ప్రయత్నంగా ప్రలోభాలకు తెరలేపి, ఒక్కో ఓటుకు రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు ముట్టజెబుతున్నారని సమాచారం. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 12 నియోజకవర్గాల నుంచి 36 మంది పోటీలో ఉన్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా? అన్నట్లు పోటీ సాగుతుండగా.. గెలుపే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆయా పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు, శ్రేణులు రంగంలోకి దిగగా.. మరోవైపు ఎలాగైనా సత్తా చాటాలని స్వతంత్రులు పావులు కదుపుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడడంతో నేతలు, అభ్యర్థులు తమ చివరి వ్యూహాలకు పదునుపెడుతున్నారు. చివరిరోజున ఉమ్మడి జిల్లాలో సభలు, సమావేశాలు, బైక్ ర్యాలీలు, కులసంఘాల భేటీలతో పట్టభద్ర ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. గురువారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో తమకు అనుకూలంగా పోలింగ్ చేయించుకునేలా కసరత్తు చేస్తున్నారు.

ఓరుగల్లు ప్రచారంలో అగ్రనేతలు..

ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచే ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. అక్టోబర్ 16న ఉమ్మడి వరంగల్‌లో తొలి ప్రచార సభను జనగామలో నిర్వహించిన సీఎం కేసీఆర్ అప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించారు. అక్టోబర్ 18న ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, టీపీసీసీ, సీఎల్పీ నేతలు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో బస్సుయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, కేంద్రమంత్రులు అమిత్‌షా, అనురాగ్ ఠాకూర్, అశ్వినికుమార్ చౌబే తదితరులు ఉమ్మడి వరంగల్‌లోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. 27న ప్రధాని నరేంద్రమోదీ మహబూబాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. కర్ణాటక, అస్సాం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయా పార్టీల తరఫున ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున ప్రచారం కోసం సీఎం కేసీఆర్ అన్ని నియోజకవర్గాల్లో తిరగ్గా.. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు క్యాంపెయిన్ నిర్వహించారు. ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో డీకే శివకుమార్, రేవంత్‌రెడ్డి, విజయశాంతి పర్యటించారు. ఉమ్మడి జిల్లాలో బీఎస్పీ పక్షాన ఆ పార్టీ అధినేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతుగా ప్రచారసభల్లో పాల్గొన్నారు. మొత్తంగా 13 రోజుల పాటు పోటాపోటీగా సాగిన ప్రచారం, డీజేలు, మైకుల మోత మంగళవారం సాయంత్రం నిలిచింది.

ఎవరి వ్యూహాలు వారివే..

ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా 216 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అత్యధికంగా వరంగల్ తూర్పు నుంచి 29 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. అత్యల్పంగా భూపాలపల్లి నుంచి 9 మంది ఉన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 36 మంది 12 సెగ్మెంట్లలో పోటీ చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 29,74,631 ఓటర్లుండగా.. 18 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు వారు 14,70,458 మంది ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో యువ, నవ ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారో అనే చర్చ రాజకీయ విశ్లేషకుల్లో సాగుతుండగా.. ఆ ఓటర్లను ఆకట్టుకోవడంపై ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. ఆరు జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో విమర్శలు, ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రోజుకోరీతిలో ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య ప్రచారం పోరు రసవత్తరంగా సాగింది. ఎట్టకేలకు ప్రచార ఆర్భాటానికి మంగళవారం సాయంత్రం తెరపడడంతో రాత్రి నుంచి డబ్బులు, మద్యం, కానుకల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. కాగా.. నగదు, మద్యం భారీగా పంపిణీ జరుగుతుందన్న ప్రచారం మేరకు ఎన్నికల అధికారులు రంగంలోకి దిగి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 24 చెక్‌పోస్టుల ద్వారా సుమారు రూ.12 కోట్ల మేరకు నగదు, మద్యం, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండగా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు 144 సెక్షన్‌ను అమల్లోకి తెచ్చారు.

కారులో నగదు.. కాంగ్రెస్ నేతపై దాడి?

దేశాయిపేట: దేశాయిపేటలో నగదు తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆకస్మికంగా కార్లను తనిఖీ చేసినట్లు తెలిసింది. రాత్రి పూట ఎనిమిది కార్లల్లో తిరుగుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థి నానా హంగామా చేసినట్లు సమాచారం. రోడ్డుపై వెళ్తున్న ఓ కారుకు.. అధికార పార్టీ నేత తన కారును అడ్డుపెట్టి ఆపినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ అభ్యర్థి అనుచరులు కార్లు దిగి కాంగ్రెస్ నాయకుడు సదానందం కారు డోర్లను కొడుతూ.. కారులో డబ్బులున్నాయంటూ చెక్ చేసి, చివరికి ఏమీ లేవని వెళ్లగొట్టినట్లు తెలిసింది. ఇదే విషయమై అధికార పార్టీ నేత ఇంతేజార్ గంజ్ సీఐకి ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. నిమిషాల్లో సీఐ ఘటనా స్థలికి చేరుకున్నారు. కాగా.. సీఐ వాహనంలో నుంచి ఒక రౌడీ షీటర్ దిగి పోలీసుల సమక్షంలోనే సదానందంపై దాడికి పాల్పడ్డాడని, సదరు రౌడీషీటర్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల అధికారులను డిమాండ్ చేశారు. ఈవిషయం వాట్సాప్‌లో వైరల్ అవడంతో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● వరంగల్‌ సీపీ అంబర్‌ కిషోర్‌ ఝూ



శాయంపేట : ఆధ్యాత్మిక చింతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝూ అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అర్చకుడు అనుదీప్‌ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ దంపతులు శివలింగానికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయ విశిష్టతను అర్చకుడు అనుదీప్‌ శర్మ ఈ సందర్భంగా సీపీకి వివరించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి ఆశీర్వచనం చేశారు. కాగా, శాయంపేట సీఐ మల్లేశ్‌.. సీపీని సన్మానించారు. కార్యక్రమంలో సీఐ మల్లేష్‌, ఎస్సై దేవేందర్‌, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.8 లక్షల విలువైన మద్యం పట్టివేత




రాయపర్తి: మండలంలోని కిష్టాపురం క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ. 8 లక్షల విలువైన మద్యం పట్టుకున్నామని ఎక్సైజ్‌ పోలీసులు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ డీసీఎంలో ఈ మద్యం లభించిందన్నారు. ఈ సరుకు తొర్రూరులోని ఓ వైన్‌ షాపునకు చెందిందని తెలిపారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అధ్యక్షా అనేదెవరో?

వరంగల్‌ పశ్చిమలో బరిలో మూడు ప్రధాన పార్టీల అధ్యక్షుల పోటీ

● బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ హనుమకొండ జిల్లా అధిపతుల రసవత్తర పోరు
● విజయం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముగ్గురు అభ్యర్థులు
● ఎవరు గెలుపొందుతారోనని తీవ్ర ఉత్కంఠ



హన్మకొండ : ప్రస్తుత తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గం ఓ ప్రత్యేకత కలిగి ఉంది. ఇక్కడి నుంచి మూడు ప్రధాన పార్టీల అధ్యక్షులు పోటీ పడుతున్నారు. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ నుంచి ఆయా పార్టీల ప్రెసిడెంట్లు తలపడుతుండగా పోటీ రసవత్తరంగా సాగుతోంది. దీంతో ఈ ముగ్గురిలో ఎవరు గెలుపొంది అసెంబ్లీలో అధ్యక్షా అంటారో అనే విషయంలో ఆయా పార్టీల నేతలతోపాటు ఓటర్లలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీఆర్‌ఎస్‌ నుంచి బరిలో ఉన్న ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌ భాస్కర్‌ నాలుగు పర్యాయాలు వరంగల్‌ పశ్చిమ నుంచి విజయం సాధించి, ఐదో విజయం కోసం ధీమాగా ముందుకు సాగుతున్నారు. ఇక.. కాంగ్రెస్‌ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌ రెడ్డి తొలిసారి పార్టీ అభ్యర్థిత్వం దక్కించుకుని అసెంబ్లీలో అడుగిడడానికి ఉవ్విళ్లూరుతున్నారు. అదే విధంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గం నుంచి తొలిసారి పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురు విజయం కోసం ఎవరికి వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఐదో విజయం కోసం దాస్యం వినయ్‌ భాస్కర్‌..

వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి దాస్యం వినయ్‌ భాస్కర్‌ ఐదో విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. 2009 సాధారణ ఎన్నికల్లో, 2010 ఉప ఎన్నికల్లో, 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా ఉద్యమకారులకు అండగా నిలవడం, ఉద్యమకారుడిగా ప్రజల్లో గుర్తింపు ఉండడం, నిత్యం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల ముంగిటికి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వినయ్‌భాస్కర్‌కు కలిసొచ్చే అంశాలు. ప్రధానంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ లబ్ధిదారులతో పాటు నియోజకవర్గంలో వైద్య చికిత్స కోసం పెద్ద మొత్తంలో సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి సాయం అందించారు. కార్మికులకు సొంతగా ప్రీమియం చెల్లించి వారికి గుర్తింపు కార్డులు ఇప్పించి బీమా సౌకర్యం కల్పించారు. దీంతో పాటు ఈ నెల 28న నిర్వహించిన సభకు సీఎం కేసీఆర్‌ రావడంతో తన గెలుస్తాననే ధీమాలో ఉన్నారు.

మొదటి సారి శాసనసభకు నాయిని రాజేందర్‌ రెడ్డి పోటీ..

వరంగల్‌ పశ్చిమ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో ఉన్న నాయిని రాజేందర్‌ రెడ్డి మొదటిసారి శాసన సభ ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్‌ పార్టీ పరిస్థితి డోలాయమానంలో పడిన సమయంలో కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారు. ఉమ్మడి వరంగల్‌, జిల్లాల పునర్విభజన తర్వాత హనుమకొండ, వరంగల్‌ జిల్లాలో పార్టీని కాపాడి ఈసారి టికెట్‌ సాధించారు. 2014, 2018లో పార్టీ టికెట్‌ ఆశించారు. ఆ రెండు సార్లు రాకపోయినా పార్టీలోనే కొనసాగుతూ వచ్చారు. ఈ సారి అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించడంతో బరిలో దిగారు. నిత్యం ప్రజల మధ్య ఉండడంతో పాటు, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్‌ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ, నాలుగు పర్యాయాలుగా వినయ్‌ భాస్కర్‌ ఎమ్మెల్యేగా ఉండి ఆయనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, వ్యతిరేకత నాయిని రాజేందర్‌రెడ్డికి అనుకూలించే అంశాలు. పార్టీ అగ్రనేతలు రాహుల్‌ గాంధీ, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌, జార్ఖండ్‌ సీఎం బూపేష్‌ భఘేల్‌, సినీ నటి విజయ శాంతి చేసిన ప్రచారం తనకు విజయం చేకూరుస్తుందనే విశ్వాసంతో ఉన్నారు.

'పద్మ'ం వికసించేనా..

వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన రావు పద్మ.. వరంగల్‌ పశ్చిమ నుంచి తొలి సారి పోటీ చేస్తున్నారు. కాగా, రావు పద్మ.. 2014 ఎన్నికల్లో వరంగల్‌ పశ్చిమ నుంచి టికెట్‌ ఆశించి చివరకు వరంగల్‌ తూర్పు నుంచి పోటీ చేసి ఓటమి పాందారు. వరంగల్‌ మహానగరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్‌ సిటీ, అమృత్‌, హృదయ్‌ పథకాల ద్వారా జరిగిన అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌ భాస్కర్‌పై ఉన్న అసంతృప్తి, కాజీపేటలో రైల్వే ఓవరాయిలింగ్‌ యూనిట్‌, వ్యాగన్‌ తయారీ పరిశ్రమ మంజూరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు అవకాశం, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడం, ప్రధాని మోదీకి ప్రజాదరణ ఉండడం, డబుల్‌ ఇంజిన్‌సర్కార్‌తో అభివృద్ధి, మహిళల ఓట్లు వంటివి రావు పద్మకు కలిసొచ్చే అంశాలు. రాష్ట్రంలో జనసేనతో పొత్తు, పవన్‌ కల్యాణ్‌ రాక, బీజేపీ నుంచి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి, ఇతర అగ్ర నాయకుల ప్రచారం చేయడం వల్ల రావు పద్మ తాను గెలుస్తాననే నమ్మకంతో ఉన్నారు.

> వరంగల్‌ పశ్చిమ నియోజక వర్గంలో **245** పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
> ఓటర్లు మొత్తం **2,86,688** ఉన్నారు. ఇందులో మహిళలు **1,45,009** మంది, పురుషులు **1,41,666** మంది, ఇతరులు **13** ఉన్నారు.



ఒకే వ్యక్తి.. మూడు ఓట్లు

● ఓటరు జాబితా తప్పుల తడక..
● కరీమాబాద్‌లో వెలుగు చూసిన ఘటన

ఖిలా వరంగల్‌/ వరంగల్‌ అర్బన్‌: ఒకే ఇంటి నంబర్‌.. ఒకే వ్యక్తికి మూడు ఓట్లు ఉన్నాయి. ఈ విషయం వరంగల్‌ కరీమాబాద్‌లోని ఓ ఓటరు జాబితాలో వెలుగు చూసింది. ఒకే పేరుతో మూడు ఓట్లు ఉండడం వల్ల క్రాస్‌ ఓటింగ్‌కు ఆస్కారం ఎక్కువగా ఉందని, ఇది కచ్చితంగా రాజకీయ నాయకులే నమోదు చేసి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు. అధికారుల పరిశీలన, తప్పిదంతోనే ఒకే పేరుతో రెండు, మూడు ఓట్లు వెలుగు చూస్తున్నాయి. వరంగల్‌ కరీమాబాద్‌ ఏరియా సాంబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్‌ 17-8-48 ఐఓఎఫ్‌ 1778174 పురుషుడు వయసు 71, మరో ఓటు శాంబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్‌ 17-3-48 ఐఓఎఫ్‌ 2441251 పురుషుడు వయసు 65, మూడో ఓటు సమబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్‌ 17-3-48 ఐఓఎఫ్‌ 1914332 పురుషుడు వయసు 90తో ఓటరు లిస్టులో ఒకే పేరుతో మూడు ఓట్లు వెలుగు చూశాయి. అధికారులు దొంగ ఓట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకో వాలని మేధావులు, ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయం మంగళవారం సోషల్‌ మీడియాలో వైరల్‌ కావడంతో వరంగల్‌ తూర్పు రిటర్నింగ్‌ అధికారి షేక్‌ రిజ్వాన్‌ బాషా విచారణకు ఆదేశించారు. దరఖాస్తుదారుడు ఫొటో, వయసు సవరణ కోసం వేర్వేరు పేర్లతో మార్పుల కోసం దరఖాస్తు చేయడంతోనే ఈ సమస్య ఏర్పడిందని తెలిపారు.



సాంబయ్య పేరిట ప్రచురితమైన ఓటరు జాబితా

ఆడబిడ్డను ఆశీర్వదించండి..

● కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సాధ్వి నిరంజన్‌ జ్యోతి

హన్మకొండ: గూండాలను ఓడించి ఆడబిడ్డను ఆశీర్వదించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సాధ్వి నిరంజన్‌ జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్‌ విగ్రహం నుంచి చౌరస్తా వరకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్‌ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గంలో మాఫియా వర్సెస్‌ మహిళకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు మహిళా బిల్లు తీసుకువచ్చారన్నారు. ఈ క్రమంలోనే రావు పద్మకు వరంగల్‌ పశ్చిమ నుంచి అవకాశం కల్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే వరంగల్‌లో అభివృద్ధి జరిగిందన్నారు. రావు పద్మను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రావు పద్మ మాట్లాడుతూ ఇద్దరు గూండాలతో తలపడుతున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. హన్మకొండలో గూండాయిజం, రౌడీయిజాన్ని అంతం చేస్తానన్నారు. వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అరాచక పాలనకు ముగింపు పలికే సమయం వచ్చిందన్నారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌ మార్తినేని ధర్మారావు, వరంగల్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జ్‌ డా.వి.మురళీధర్‌ గౌడ్‌, నాయకులు రావుల కిషన్‌, కొలన్‌ సంతోష్‌ రెడ్డి, దేశిని సదానందం గౌడ్‌, కార్పొరేటర్లు చాడ స్వాతి శ్రీనివాస్‌ రెడ్డి, గుజ్జుల వసంత మహేందర్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్‌ జ్యోతి

విద్య ద్వారానే వ్యవస్థ నిర్మాణం



మాట్లాడుతున్న వీసీ రమేశ్‌

● కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌

కేయూ క్యాంపస్‌: విద్య ద్వారానే వ్యవస్థ నిర్మాణమవుతుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌ అన్నారు. మంగళవారం కేయూలో బీసీ సెల్‌ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహనీయుల సంస్కరణల ద్వారా వచ్చిన మార్పులు ఆచరణలో అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. కేయూ రిటైర్డ్‌ ఆచార్యుడు కె మురళీమనోహర్‌ మాట్లాడుతూ దేశంలో ఇంకా నిరక్ష్యరాస్యత ఉందన్నారు. సామాజిక సంస్కరణలు ఇంటివద్దనుంచే ప్రారంభం కావాలన్నారు.అందుకు జ్యోతిరావుపూలేనే ఆదర్శమన్నారు. కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య టి శ్రీనివాస్‌రావు , కేయూ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్‌ గాదె సమ్మయ్య, కేయూ బీసీ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎ శ్రీనివాస్‌ మాట్లాడారు. తొలుత కేయూ దూరవిద్య కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుపూలే,సావిత్రి బాయిపూలే దంపతుల విగ్రహాలకు వీసీ రమేశ్‌, ఇతర ఆచార్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్‌ వి రాంచంద్రం, ఆచార్య రాంనాథ్‌ కిషన్‌, ప్రొఫెసర్‌ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్‌ వి కృష్ణమాచార్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

నేటి నుంచి 4 వరకు 144 సెక్షన్‌ అమలు

● తనిఖీల్లో రూ.12.33 కోట్లు స్వాధీనం
● ఎన్నికల విధులకు 5,700 మంది పోలీసులు
● వరంగల్‌ సీపీ అంబర్‌ కిషోర్‌ ఝూ



మాట్లాడుతున్న సీపీ అంబర్‌ కిషోర్‌ ఝూ


వరంగల్‌ క్రైం: కమిషనరేట్‌ పరిధిలో పోలింగ్‌ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝూ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ మంగళవారం సాయంత్రం వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీపీ అంబర్‌ కిషోర్‌ ఝూ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధి ఎనిమిది శాసనసభ స్థానాలతో పాటు, పొరుగు జిల్లాలకు చెందిన కమిషనరేట్‌లో పాక్షికంగా ఉన్న హుస్నాబాద్‌, హుజూరాబాద్‌, భూపాలపల్లి నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కమిషనరేట్‌ పరిధి వరంగల్‌ ఈస్ట్‌, వరంగల్‌ వెస్ట్‌, వర్ధన్నపేట, పరకాల, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్‌ ఘన్‌పూర్‌ నియోజకవర్గాల్లో మొత్తం 1,128 పోలింగ్‌స్టేషన్లలో 2,126 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయని, ఈ ఎన్నికల నిర్వహణకు డీసీపీ స్థాయి నుంచి హోంగార్డు వరకు మొత్తం 4వేల మంది పోలీస్‌ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 1,700 మందికిపైగా కేంద్ర సాయుధ పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ వెలువడ్డ నాటి నుంచి ఇప్పటి వరకు కమిషనరేట్‌ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం రూ.12.33 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు రూ. 55 లక్షల విలువైన మద్యం, గుడుంబా, రూ.10 లక్షల విలువైన ఐదు వందల కిలోల నల్లబెల్లం, పటిక, రూ 1.64 కోట్ల విలువైన 667 కిలోల గంజాయి, ఆరున్నర కిలోల బంగారం పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్‌ పరిధిలో 842 కేసులు నమోదు చేసినట్లు సీపీ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇప్పటి వరకు 7,842 మందిని ముందస్తుగా అరెస్టు చేయగా.. ఇందులో 579 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు తెలిపారు.

ఆంక్షలు అమలు

పోలింగ్‌ సజావుగా నిర్వహించేందుకు పోలీస్‌ విభాగం పలు ఆంక్షలు విధించినట్లు సీపీ అంబర్‌ కిషోర్‌ ఝూ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రజలు పాటించాలని మంగళవారం సాయంత్రం నుంచి డిసెంబర్‌ 4 వరకు కమిషనరేట్‌ పరిధిలో 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈసమయంలో ఐదుగురికంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండడం నిషేధించినట్లు తెలిపారు. ఇతర నియోజకవర్గం నుంచి ప్రచారానికి వచ్చిన వారు స్థానికంగా ఎవరూ ఉండవద్దని, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు, రాజకీయ పార్టీల నేతలు 28న సాయంత్రం 5గంటల్లోపు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, ఇతర కారణాలతో ఇక్కడ లాడ్జీల్లో నివాసం ఉండే వారు సరైన కారణాలు, ఆధారాలు చూపాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు రవీందర్‌, అబ్దుల్‌ బారీ, బీఎస్‌ఎఫ్‌ కామాండెంట్‌లు హెచ్‌ఎస్‌ సాయిని, ముకేశ్‌కుమార్‌, ఎస్‌బీ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్‌, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కొడుకును చూడడానికి వెళ్లి..

● అమెరికాలో వరంగల్‌ వాసి మృతి



గోవర్ధన్‌రెడ్డి (ఫైల్‌)

హసన్‌పర్తి: అమెరికాలో ఓరుగల్లు వాసి దుర్మరణం చెందాడు. అమెరికాలో ఉంటున్న కొడుకును చూడడానికి వెళ్లిన ఆయన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా.. ఉమ్మడి వరంగల్‌ పరిధిలోని హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని గంటూరుపల్లికి చెందిన రైతు పెద్ది గోవర్ధన్‌రెడ్డి కొడుకు వంశీకృష్ణారెడ్డి ఉన్నత విద్యాభ్యాసం కోసం రెండేళ్ల క్రితం అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లాడు. కాగా వంశీకృష్ణారెడ్డిని చూడడానికి ఈనెల 4న గోవర్ధన్‌రెడ్డి న్యూయార్క్‌కు వెళ్లాడు. 15 రోజులు అక్కడే ఉన్న గోవర్ధన్‌రెడ్డి అనంతరం అట్లాంటాలో ఉంటున్న స్నేహితుడి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అట్లాంటాలో తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7.30 గంటలకు) వాకింగ్‌ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. గోవర్ధన్‌రెడ్డి మృతదేహం రాక కోసం గంటూరుపల్లిలో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



రాములు (ఫైల్‌)

టేకుమట్ల: ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ముంజాల రాములు (55) తనకున్న ఒకటిన్నర ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, పత్తి పంటలు సాగు చేశాడు. కాగా, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వరి పంట పూర్తిగా ధ్వంసమైంది. పత్తి దిగుబడి సరిగా లేక భారీగా నష్టపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం తన ఇంట్లోనే గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి రాములును చిట్యాల సివిల్‌ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్చారు. రాములు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్‌ తెలిపారు.

భవనంపై నుంచి పడి ఒకరి మృతి



మోత్యా (ఫైల్‌)

నర్సంపేట రూరల్‌ : భవనంపై నుంచి పడి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలైన ఘటన నర్సంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన జర్పుల మోత్యా (65) కొడుకు వైద్యుడు కాగా పట్టణంలోని నర్సంపేట-వరంగల్‌ ప్రధాన రహదారి సమీపంలోని అతడి ఆస్పత్రి భవనంపై ఇటీవల మరో రెండు అంతస్తులు నిర్మించాడు. ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతుండగా మోత్యా, కూలీకి వచ్చిన ధరావత్‌ చక్రు రెండో అంతస్తు కూలి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మోత్యా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. చక్రును మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మోత్యా మృతితో మహేశ్వరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.